

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-చాగల్లు

ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.5,52,462 విలువైన చెక్కులను లబ్ధిదారులకు ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు ఆదివారం అందజేశారు. చాగల్లులో 8 మందికి వీటిని అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఆళ్ల హరిబాబు, ఎఎంసి చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్, కూటమి నాయకులు పాల్గొన్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎంఎల్ఎ వెంకటేశ్వరరావు

చుక్కల్లో బాణసంచా ధరలు

- జిఎస్‌టి తగ్గింపులో లేని మందుగుండు
- ఆందోళనలో కొనుగోలుదారులు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

జిఎస్‌టి పన్నుల భారంతో ఈ ఏడాది దీపావళి పండుగ ప్రియమైంది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం 270 వస్తువులపై జిఎస్‌టి తగ్గించింది. కానీ జాబితాలో బాణసంచా లేదు. బాణసంచా సామగ్రిపై 18 శాతం జిఎస్‌టి కొనసాగుతోంది. మరోవైపు గతేడాదితో పోలిస్తే 20 శాతం వరకు ధరలు పెరిగాయి. శివకాశి తదితర ప్రాంతాల నుంచి దిగుమతయ్యే టపాసులపై 18 శాతం జిఎస్‌టి అమలవుతోంది. సాధారణంగా ఎంఆర్‌పి ధరలపై కొన్ని దుకాణాల్లో 75 శాతం, మరికొన్ని దుకాణాల్లో 60 శాతం రాయితీలు ఇవ్వడం పరిపాటి. రాయితీల్లో ఎటువంటి వ్యత్యాసం లేకపోయినప్పటికీ ఎంఆర్‌పి ధరల్లోని వ్యత్యాసం తీవ్ర ప్రభావం చూపుతోంది. ఫలితంగా ఈ ఏడాది బాణసంచా ధరలు కొండెక్కాయి. దీపావళి పండుగ వేళ.. జిల్లావ్యాప్తంగా కొవ్వూరు, రాజమండ్రి డివిజన్ పరిధిలో సుమారు 500కు పైగా బాణసంచా దుకాణాలు ఏర్పాటయ్యాయి. అనధికారికగా ఈ సంఖ్యకు రెట్టింపు సంఖ్యలో బాణసంచా దుకాణాలు



ఏర్పాటయ్యాయి. గత రెండ్రోజులుగా జోరుగా వ్యాపారం జరిగింది. శాశ్వత లైసెన్స్ ఉన్న దుకాణాల్లోనూ బాణసంచా విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. తాత్కాలిక అనుమతి పొందినవారు దుకాణాలు ఏర్పాటు చేసి.. విక్రయాలు చేస్తున్నారు.

చుక్కలనంటుతున్న ధరలు

కాకరపువ్వొత్తులు సాధారణ రకం రూ.150, కలర్స్ అయితే రూ.200, భూచక్రాల సైజు, కంపెనీలను బట్టి ప్యాకెట్ రూ.50 నుంచి రూ.150 పలుకుతోంది. హండ్రెడ్‌వాలా టపాసులు రూ.30-50, విష్ణుచక్రాల బాక్సు రూ.200 నుంచి రూ.250కు విక్రయిస్తున్నారు. చిచ్చుబుడ్లు మట్టితో చేసినవి ఒకటి రూ.30, కంపెనీల చిచ్చుబుడ్లు చిన్నవి బాక్సు రూ.100 నుంచి రూ.200 వరకూ అమ్మకాలు జరుగుతున్నాయి. గతేడాది లక్ష్మీబాంబుల కట్ట(10) రూ.200 ఉండగా ఈ ఏడాది రూ.600 పలుకుతోంది. తక్కువ నాణ్యతకు చెందిన క్రాకర్లు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. బాణసంచా విక్రయాలకు సంబంధించి లైసెన్స్ నెంబర్, టిన్ నెంబర్‌తో ఉన్న రశీదుపై బిల్లులు ఇవ్వాలి. కానీ తెల్లకాగితంపై బిల్లురాసి కొనుగోలుదారులకు ఇస్తున్నారు. బిల్లుపై వస్తువు ధర ముద్రణ లేకుండా కొనుగోలుదారులకు మోసం చేస్తున్నారు. కనీసం రూ.2 వేలు తీసుకెళితే తప్ప బాణసంచా సామగ్రి వచ్చే పరిస్థితి లేదని వినియోగదారులు పేర్కొంటున్నారు.

ఆందోళనలో కొనుగోలు దారులు

సరదా, సంతోషాల పండుగల్లో ఒకటైన దీపావళి ప్రియమైంది. టపాసుల ధరలకు జిఎస్‌టి మినహాయింపు లేకపోవడంతో ధరలు తగ్గలేదు. కాకరపువ్వొత్తులు, చిచ్చుబుడ్లు, భూచక్రాలు మొదలుకొని లక్ష్మీ ఔట్లు, ఫ్యామిలీ ప్యాకులు సైతం ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఇటీవల రాయవరంలో జరిగిన ఘటనతో అధికార యంత్రాంగం పూర్తిగా అప్రమత్తమైంది. దీంతో జిల్లాలో ప్రత్యేక ఆదరణ ఉన్న కొన్ని రకాల టపాసులు ఈ పండుగకు దూరమయ్యాయి. జిల్లావ్యాప్తంగా మండల కేంద్రాల్లో బాణసంచా స్టాళ్లు ఏర్పాటు చేశారు. నలుగురైదుగురు వ్యాపారులు కలిసి ఒక స్టాల్‌ను నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం దుకాణాలు మానవ నివాస ప్రాంతాల నుంచి కనీసం 3 మీటర్ల దూరంలో ఉండాలి. షాప్ విస్తీర్ణం కనీసం 9 చదరపు మీటర్ల విస్తీర్ణం తప్పనిసరిగా ఉండాలి. సరైన వెంటిలేషన్ ఉండాలని, ఫైర్ సేఫ్టీ నిబంధనల ప్రకారం 4 బకెట్ల నీరు, 4 బకెట్ల ఇసుకతో ఫైర్ పాయింట్ ఏర్పాటు చేయాలి. ప్రతి షాపు అగ్ని ప్రమాద నిరోధక పరికరాలతో సిద్ధం కావాలి. ప్రతి ప్రాంగణంలో డ్రై కెమికల్ పౌడర్ ఫైర్ ఎక్స్‌టింగ్విషర్, నాలుగు ఇసుక బస్తాలు, 200 లీటర్ల నీరు కలిగిన డ్రమ్, 9 లీటర్ల నీటి టైప్ ఎక్స్‌టింగ్విషర్, అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించేందుకు తగినంత నీరు తప్పనిసరిగా ఉంచాలి. జనావాసాల మధ్య, జాతీయ రహదారుల చెంతనే తాత్కాలిక షాపులు ఏర్పాటు చేయటం ఆందోళనకు గురి చేస్తోంది.

కనీసం కొనుగోలు రూ.5 వేలు

ఈ ఏడాది బాణసంచా ధరలు అధికంగా ఉన్నాయి. ప్రతి ఏడాదీ రూ.3000 వెచ్చిస్తే పది రకాలైనా వచ్చేవి. ప్రస్తుతం రూ.5000కు కొనుగోలు చేశాను. 10 రకాలకు మించలేదు. కేంద్ర ప్రభుత్వం బాణాసంచాకు జిఎస్‌టి అమలు చేస్తే కొంత ఊరట లభించేంది. ధరలు తగ్గకపోగా ఎంఆర్‌పి ధరలు పెరగడంతో మరింత ప్రియంగా మారాయి. స్థానిక తయారీ టపాసులు లేకపోవడం నిరాశ కలిగించే విషయమే.

- జి.రామారావు, సింహాచల్ నగర్.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కీర్తి చేకూరి

సూపర్ జిఎస్‌టి ద్వారా ఆర్థిక ప్రయోజనాలు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం సిటీ

కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకు వచ్చిన సూపర్ జిఎస్‌టి సూపర్ సేవిగ్స్ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, రాజమండ్రి రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరిల సూచించారు. ఆదివారం రాజమండ్రి హోటల్ ఆనంద్ రీజెన్సీ పందిరి హాలులో రాజమహేంద్రవరం షాపింగ్ ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా సూపర్ జిఎస్‌టి సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాజమండ్రి రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి, కలెక్టర్ కీర్తి చేకూరి హాజరయ్యారు. బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ జిఎస్‌టి 2.0 ద్వారా పన్నుల విధానంలో పారదర్శకత రావడంతో పాటు ప్రజలకు ఆర్థి ప్రయోజనాలు కలుగుతాయన్నారు. జనరిక్ మందుల వినియోగం, దేశీయ ఉత్పత్తులను ప్రోత్సహించడం, మేకిన్ ఇండియా, మేకిన్ ఆంధ్రప్రదేశ్ దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ సూపర్ జిఎస్‌టి, సూపర్ సేవింగ్స్‌పై ప్రజలకు అవగహన కల్పించేందుకు గత నెల రోజులుగా ప్రచారం చేశామని తెలిపారు. అనంతరం లక్కీ డిప్ విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిఎస్‌టి నోడల్ అధికారి మేఘా స్వరూప్, వాణిజ్య పన్నుల కమిషనర్ బి.సుధాకర్, స్పెషల్ కలెక్టర్ కె.భాస్కర్ రెడ్డి, వాణిజ్య పనుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ టి.వి.నాగేశ్వరరావు, జిఎస్‌టి అధికారి హుసేన్ షరీఫ్, అడిషనల్ ఎస్‌పి ఎవి.సుబ్బరాజు, యాదవ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల నాగేశ్వరరావు, ఎస్‌సి కార్పొరేషన్ డైరెక్టర్ మద్దా మణి తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురంలో భారీ వర్షం

ప్రజాశక్తి-గోపాలపురం

మండలంలో శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకూ కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. గోపాలపురం మండలంలో 61.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు ఎఎస్ఒ జోడాల వెంకటేశ్వరరావు తెలిపారు. వాదాలకుంట, కోమటికుంట పలు ప్రాంతాలనుంచి తీవ్ర వరద నీరు రావడంతో గోపాలపురం లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి చెరువులు, కుంటలు వాగులు వంకలు పొంగి పొర్లాయి. గోపాలపురం పంచాయతీ వెనుక వీధులు, రహదారుల్లో సుమారు రెండు అడుగులు ఎత్తు వరద నీరు చేరింది. ఇళ్లల్లో సైతం వరద నీరు రావడంతో ప్రజలు అవస్థలు పడ్డారు. అనేక ఎకరాల్లో వరి పంట పొలాలు నీట మునిగాయి.. స్థానిక ఉప్పరగూడెంలో రోడ్లపై నుంచి వరద నీరు ప్రవహించింది. రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి.



జలమయం అయిన రహదారులు

కార్తీక మాసంలో యాత్రికులకు ఏర్పాట్లు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

కార్తీక మాసం నేపథ్యంలో గోదావరి స్నానాలు ఆచరించేందుకు వచ్చే యాత్రికులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్టు కమిషనర్ రాహుల్ మీనా తెలిపారు. ఆదివారం ఆయన పుష్కర ఘాట్‌లో ఏర్పాట్లను పరిశీలించారు. యాత్రికుల రద్దీకి తగినట్టు ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలూ కల్పిస్తున్నామన్నారు. లైటింగ్, సిసి కెమెరాలు, తాగునీరు, స్నానపు గదులు, దుస్తులు మార్చుకునే గదులు, లాకర్లను పరిశీలించారు. పబ్లిక్ అడ్రస్సింగ్ సిస్టంతో పాటు స్విమ్మర్లు, పడవలను సరిపడా అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. ఘాట్ వెంబడి నది ఒడ్డున ఇసుక వేయించాలని, పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. కార్తీక మాస దీపోత్సవ వేడుకల్లో యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం కలగకూడదని స్పష్టం చేశారు. ఆయన వెంట ఎంహెచ్ఒ వినూత్న, ఎస్ఇ ఇన్‌ఛార్జి రీటా, ఇఇ మాధవి, డిఇ సత్యనారాయణ, ఎఇలు వెంకటేష్, ఆంజనేయులు ఉన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్

3 నెలలుగా అంధకారంలో అంగన్‌వాడీ కేంద్రం

ప్రజాశక్తి- నిడదవోలు

విద్యుత్ సరఫరాను పునరుద్ధరించి, మా చిన్నారుల ఆట పాటలకు సహకరించాలని స్థానిక టక్కరి బాబా పేట అంగన్వాడీ కేంద్రం చిన్నారుల తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని అర్థిస్తున్నారు. నిడదవోలు పట్టణంలోని 134వ నెంబర్ అంగన్‌వాడీ కేంద్రానికి మూడు నెలల కిందట స్మార్ట్ మీటర్ ఏర్పాటు చేయగా అకస్మాత్తుగా విద్యుత్ సరఫరా నిలిచి పోయిందన్నారు. దీంతో అయోమయంలో పడ్డ కేంద్రం నిర్వాహకులు కరెంటు బిల్లు కట్టే విషయమై మున్సిపల్ అధికారులను సంప్రదించారు. మున్సిపల్ పరిధి నుంచి, ఐసిడిఎస్ వేరు కావడంతో మున్సిపల్ ఆఫీసు తరుపున కరెంట్ బిల్లు కట్టడం ఆపేసి ఇకపై కట్టాల్సిన బాధ్యత తమకి కాదంటూ చేతులు దులుపేసుకున్నారు. అటు సొంత శాఖ పట్టించుకోక ఇటు మున్సిపాలిటీ వదిలేయడంతో ఇప్పుడు ఆ కేంద్రం పరిస్థితి రెంటికి చెడ్డ రేవడిలా మారింది. ఓవైపు మున్సిపాలిటీ, మరోవైపు ఐసిడిఎస్ ఇద్దరూ ఒకరిపై ఒకరు నెపం నెట్టుకోవడం కారణంగా పెండింగ్‌లో ఉన్న రూ.3000 పైబడి బిల్లు చెల్లిస్తేగానీ విద్యుత్ సరఫరా పొందలేని పరిస్థితి. పాలనలో కూటమి ప్రభుత్వం, అందునా గౌరవ మంత్రి ఇలాకాలో కనీసం అంగన్‌వాడీ కేంద్రానికి విద్యుత్ సరఫరా ఇవ్వలేని పరిస్థితుల్లో ఉందా అని చిన్నారుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. సూపర్ సిక్స్ సూపర్ హిట్ అని చెప్పుకుంటున్న పార్టీలోని వార్డు నాయకులకు ఇది కనిపించలేదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, కూటమి ప్రభుత్వం నాయకులు చొరవ తీసుకుని సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

చైల్డ్ కేర్ లీవ్ కాలపరిమితి పెంపుపై హర్షం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

మహిళా ఉద్యోగులు చైల్డ్ కేర్ లీవ్ సదుపాయాన్ని ఎప్పుడైనా వినియోగించుకునే విధంగా అనుమతిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా ఆదివారం రాజమహేంద్రవరంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ ఆవరణలో జిల్లా మహిళా విభాగం సమావేశం జి.అనిత అధ్యక్షతన నిర్వహించారు. ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు పి.గిరి ప్రసాద్ వర్మ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ, అక్టోబర్ 18, 2025న రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించి, మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేయడం, స్వయంగా పాల్గొని ఉద్యోగుల ఇబ్బందులను తెలుసుకొని త్వరలోనే సమస్యల పరిష్కారానికి హామీ ఇవ్వడం శుభ పరిణామం అన్నారు. మహిళా ఉద్యోగుల పక్షాన చైల్డ్ కేర్ లీవ్ సదుపాయం పెంపు అత్యంత సానుకూలమైన నిర్ణయమని, దేశంలోనే తొలిసారిగా మహిళా ఉద్యోగుల హక్కులను గుర్తించి ప్రధానమంత్రి స్థాయిలో తీసుకున్న ఈ నిర్ణయం చారిత్రాత్మకమని పేర్కొన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కెఆర్.సూర్యనారాయణ ప్రభుత్వానికి పలు డిమాండ్లపై సవివర నివేదిక సమర్పించారని, వాటిలో అనేక అంశాలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని తెలిపారు. ఇతర సంఘాలకు భిన్నంగా తమ సంఘం పిఆర్‌సి కమిషన్‌కు రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తిని చైర్మన్‌గా నియమించాలనే ప్రత్యేక డిమాండ్ ఉంచిందని చెప్పారు. పెండింగ్ బకాయిల చెల్లింపులో తమ సంఘం సూచించిన విధంగా ఇళ్ల స్థలాల కేటాయింపు రూపంలో బకాయిల చెల్లింపు పద్ధతిపై ప్రభుత్వం స్పందించడం సంతోషకరమని గిరి ప్రసాద్ వర్మ తెలిపారు. త్వరలోనే ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కానున్నాయని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో మహిళా విభాగం జిల్లా కో చైర్పర్సన్ వి.అంజలిశ్రీ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రికి మహిళా ఉద్యోగుల తరపున కతజ్ఞతలు తెలిపారు. జిల్లా కన్వీనర్ మద్ర ఇంద్ర సమావేశంలో కేక్ కట్ చేసి ఆనందోత్సవాలు నిర్వహించారు. మహిళా విభాగం జిల్లా కో-చైర్మన్ దాసి దివ్య మాధురి, వైస్ చైర్‌పర్సన్ పాలకొలను నాగ సత్యవాణి, తోట మధులత, కో కన్వీనర్లు చిన్నం మంజూష, చింతల సీత, ఓలేటి లక్ష్మి, జి.గంగాభవాని, ఆర్గనైజింగ్ కార్యదర్శి వైఎన్. శైలజ తదితరులు ప్రసంగించారు. చైల్డ్ కేర్ లీవ్ విషయంలో చొరవ చూపిన కెఆర్.సూర్యనారాయణకు మహిళా విభాగం ప్రత్యేక ధన్యవాదాలు తెలిపింది. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు బి.రవికుమార్, కెవెంకటేశ్వరరావు, కోరుకొండ తాలూకా కార్యదర్శి డి.భగవాన్ దాస్, బాల రజిని తదితరులు పాల్గొన్నారు.




హర్షం వ్యక్తం చేస్తున్న ఉద్యోగినులు

మార్కెట్ కమిటీ చైర్మన్‌గా తనకాల

ప్రజాశక్తి-రాజానగరం

రాజానగరం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా తనకాల వెంకటరమణమ్మ నాగేశ్వరరావు, ఉపాధ్యక్షునిగా ముక్కాదేవి దుర్గ, రాజానగరం రాయల్ కన్వెన్షన్ హాల్లో ఎంఎల్‌సి పేరాబత్తుల రాజశేఖర్ ఆదివారం ప్రమాణ స్వీకారం చేయించారు. వీరితో పాటు మార్కెట్ కమిటీ సభ్యులుగా బల్లేని కనకమహాలక్ష్మి, పెనుగొండ శ్రావణలక్ష్మి, మద్దాల అచ్చమ్మ, పెమ్మనబోయిన వెంకటేష్, కలుం భాగ్యలక్ష్మి, గొంతిన సూరిబాబు, సైతిని లక్ష్మి, వాకపల్లి అప్పలరాజు, బొర్రా వీరబాబు, యర్రంశెట్టి పోలారావు, దండమూడి రవికుమార్, యడవల్లి సూర్యచక్రం, యర్రంశెట్టి శ్రీను, తూర్పు గోనుగూడెం సర్పంచ్ గల్లా సత్యశ్రీ, దివాన్‌చెరువు సహకార సంఘం అధ్యక్షుడు ముత్యం వెంకటేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేశారు. దీనిలో పార్లమెంట్ సభ్యురాలు దగ్గుపాటి పురందేశ్వరి, ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ, టిడిపి సీనియర్ నాయకులు యనమల రామకృష్ణుడు, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి శుభాకాంక్షలు తెలిపారు.



ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎంఎల్‌సి రాజశేఖర్

ధాన్యం కొనుగోలు వెంటనే ప్రారంభించాలి

ప్రజాశక్తి-చాగల్లు

ధాన్యం కొనుగోలు వెంటనే ప్రారంభించాలని రైతు సంఘం జిల్లా కన్వీనర్ గారపాటి వెంకట సుబ్బారావు డిమాండ్ చేశారు. ముందస్తుగా గిట్టుబాటు ధర కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినా ఇప్పటివరకు కేంద్రం తెరవలేదన్నారు. ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతులను ఆదుకోవాలని కోరారు. ప్రతి గింజీ కొనుగోలు చేస్తామని ప్రభుత్వం వాగ్దానం చేసిందని గుర్తు చేశారు. వర్షాకాలంలో కోతలు వచ్చేసరికి డయల్ మిషన్లు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు ప్రభుత్వం రైతు గిట్టుబాటు కనిపించి వర్షాకాలంలో కోతలు వచ్చేసరికి రైతులు దగ్గర బరకాలు లేక చాలా ఇబ్బంది పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

పదవులు పొందిన పలువురికి సత్కారం

ప్రజాశక్తి-గోకవరం


వైసిపిలో పలు పదవుల్లో నియమితులైన వారిని ఆదివారం ఘనంగా సత్కరించారు. పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి, తోట నరసింహం, పార్టీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోట శ్రీరామ్‌జీ సిఫార్సుతో రైతు విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా దాసరి వెంకటేశ్వరరావ, క్రిస్టియన్ మైనార్టీ విభాగం సెక్రటరీగా అంబటి అబ్రహం, సోషల్ మీడియా విభాగం ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా సివిలి బాలు నియమితులయ్యారు. వారిని పలువురు పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో దాసరి బుచ్చిబాబు, మడికి మైనర్ బాబు, బిజ్జి రాజు, మచ్చ మురళి, బడితబోయిన చిన్న, నండూరి బుజ్జి పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ సంతకాల సేకరణ

ప్రజాశక్తి- గోపాలపురం

ఓట్ల అవతవకలకు పాల్పడి బిజెపి ప్రభుత్వం గద్దెనెక్కిందని, అది ప్రజాస్వామ్యంలో అత్యంత కిరాతకమైన చర్యని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టికె.విశ్వేశ్వరరెడ్డి ఆరోపించారు. ఓటర్ల జాబితా అవకతవకలపై కాంగ్రెస్ పార్టీ చేపట్టిన దేశవ్యాప్త ఉద్యమంలో భాగంగా అదివారం గోపాలపురంలో ప్రజల నుంచి సంతకాలను సేకరించారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. ఒక అసెంబ్లీ నియోజకవర్గంలో రెండు లక్షల ఓట్లు ఉండగా.. అందులో లక్షా ముప్పై ఓట్లు పోలయ్యాయని, లెక్కించే సమయానికి రెండు లక్షల ఓట్లు లెక్కింపయ్యాయని, అంతకంటే ఓట్లు చోరీ జరిగిందనడానికి నిదర్శనమేమిటని ప్రశ్నించారు. ఆ విధంగా గద్దెనెక్కిన మోడీ.. దేశాన్ని ప్రపంచ బ్యాంకుకు తాకట్టు పెట్టారని దుయ్యబట్టారు. పార్టీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి చోడదాసి మార్టిన్ లూథర్ మాట్లాడుతూ.. ఓటు ఎంతో విలువైనదని, అలాంటి ఓట్లను బిజెపి దొంగిలించడం ఎంతో బాధాకరమన్నారు. ఓటర్ల జాబితాలో అనేక అవకతవకలకు పాల్పడి, లేని ఓట్లను ఉన్నట్టు చూపించి, ఉన్న ఓట్లను తొలగించి బిజెపి చోరీకి పాల్పడిందని దుయ్యబట్టారు. దాని వల్ల నిజమైన ఓటర్లు వారికి నచ్చిన నాయకులను ఎన్నుకోలేకపోయారని తెలిపారు. అనంతరం గోపాలపురం ప్రధాన కూడలి నుంచి, చెక్‌పోస్ట్ సెంటర్ వరకూ పాదయాత్ర చేశారు. సుంకర సత్యనారాయణ, జిల్లా కిసాన్ సెల్ చైర్మన్ మట్టపర్తి రామ్మోహన్ రావ్, సీనియర్ నాయకులు రఫీఉల్లా బేగ్, కాకర్ల హరిబాబు, వేగివాడ నాగేశ్వరరావు, దాసరి కుటుంబరావు, పుల్లారావు, మురళీ, బాబ్జీ పాల్గొన్నారు.


కార్టూ'నిజం'



పాఠశాల స్థాయి చెకుముకి పోటీలు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ సంబరాలు జిల్లాలోని అన్ని మండలాల్లో వివిధ పాఠశాలల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. నాలుగు స్థాయిల్లో నిర్వహిస్తున్న పోటీలలో భాగంగా మొదటి స్థాయి చెకుముకి పాఠశాల స్థాయి సైన్స్ సంబరాలకు విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపల్స్, కరెస్పాండెంట్స్, ఉపాధ్యాయులు హాజరయ్యారని వేదిక జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.భీమయ్య, ఎన్.రవిబాబు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఉత్సాహంగా చెకుముకి సంబరాల్లో పాల్గొన్నారు. నవంబర్ 1న మండల, పట్టణ స్థాయిలో చెకుముకి పరీక్ష జరుగుతుందని, పాఠశాల స్థాయి విజేతలు పాల్గొనాలని తెలిపారు.



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఘనంగా అభిరామ్ పుట్టినరోజు వేడుక

ప్రజాశక్తి - సీతానగరం

తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు పెందుర్తి అభిరామ్ పుట్టిన రోజు వేడుకలు విశాఖపట్నంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ నివాసం వద్ద శ్రీనివాస్ కేక్ కట్ చేయించి, అభిరామ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అభిరామ్‌ను శ్రీనివాస్ సాలువాతో సత్కరించి అభినందించారు. అభిరామ్ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కరువు భత్యం చెల్లింపుపై హర్షం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

విశ్రాంత ఉద్యోగులు, ప్రభుత్వోద్యోగులకు కరువు భత్యం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయడంపై ధవళేశ్వరం పెన్షనర్స్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది. అధ్యక్షుడు యర్రమోతు ధర్మరాజు అధ్యక్షతన సంఘ భవనంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అన్ని ఉద్యోగ సంఘాలతో సమావేశం నిర్వహించి, మన సమస్యలు స్వయంగా విచారించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వంలో పిఆర్‌సిలో తాత్కాలిక భృతి కంటే ఫిట్‌మెంట్‌లో కోత, క్వాంటమ్‌లో కోత, రవాణాబత్యం, అర్జిత సేలవు ఇవ్వక, ఎపిజిఎల్ఐ, జిపిఎఫ్ చెల్లింపుల నిలిపివేత, పదవీ విరమణ చేసిన వారికీ రాయితీలు బట్వాడా చేయకుండా, మరణించిన వారికి మట్టి ఖర్చులు చెల్లించకుండా, డిఎ బకాయిలు చెల్లించకుండా చేశారన్నారు. సొమ్ములో ఆదాయపన్ను తగ్గింపు, ఎప్పుడు పింఛన్లు, జీతాలు పడతాయో తెలియక బ్యాంకుల చుట్టూ కాళ్ళరిగేలా విస్తుపోయిన వర్గాలకు, ప్రతి నెలా మొదటితేదీనే జీతాలు పడడంతోపాటు కరువుబత్యం ప్రకటన పద్నాలుగు లక్షల కుటుంబాలలో సంతోషం నింపిందన్నారు. ఉద్యోగ, పెన్షనర్లకు గత ప్రభుత్వం బకాయిపెట్టినవి అంచెలంచెలుగా చెల్లిస్తారనే ధీమా ఏర్పడిందన్నారు. ప్రధాన కార్యదర్శి దువ్వూరి కామేశ్వరశర్మ, కోశాదికారి ఉర్రింకల సత్యనారాయణ, వి.వెంకటేశ్వర్లు, తోరం కేశవరావు, బండారు రవీంద్ర, నల్లి విజయ మోహన్, సిహెచ్.నరసింహారావు, విన్నకోట సాంబశివరావు, శ్రీరంగం వెంకటేశ్వరరావు, కొండా సూర్యనారాయణ, సుబ్బారావు, దానియేలు పాల్గొన్నారు.

ఆశ్రమ సేవారథం ప్రారంభం

ప్రజాశక్తి -దేవరపల్లి

గొల్లగూడెం వద్ద గల లగడపాటి రామ లక్ష్మమ్మ రామానాయుడు వికలాంగులు, వృద్ధుల ఆశ్రమంలో ఆదివారం గౌరవాధ్యక్షురాలు లగడపాటి రామ లక్ష్మమ్మ ఆశ్రమాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె దాతల సహకారంతో ఆశ్రమ నిర్వహణ పనుల కోసం ఏర్పాటు చేసిన రూ.6 లక్షల విలువైన ఆశ్రమ సేవారథాన్ని ప్రారంభించారు. అనంతరం వృద్ధుల ఆశ్రమం, వికలాంగుల ఆశ్రమం, సర్జికల్స్, ఆర్టిఫిషియల్ లింబ్స్ సెంటర్‌ను సందర్శించారు. అక్కడి కార్యకలాపాలను పరిశీలించారు. ఆశ్రమ సేవా కార్యక్రమాల కోసం రూ.25 వేలను ఆశ్రమ ఫౌండర్ అండ్ చైర్మన్ శ్రీ కాగిత భాస్కరరావుకు విరాళంగా అందజేశారు. ఆశ్రమ నిర్వాహకులు, సిబ్బంది లగడపాటి రామలక్ష్మమ్మను సత్కరించారు.

ఎఎంసి డైరెక్టర్ సతీష్‌కు సత్కారం

ప్రజాశక్తి-నిడదవోలు

ఎఎంసి డైరెక్టర్‌గా నియమితులైన కాసాని సతీష్‌ను ఆదివారం పలువురు నాయకులు అభినందించారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షులు పిక్కి నాగేంద్ర, మోర్త ప్రమోద్ కుమార్, టంగుటూరి శ్రీను, నిడదవోలు పట్టణ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో సతీష్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు పిక్కి నాగేంద్ర మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడిన వారిని ఎప్పుడూ గుర్తుపెట్టుకుంటుందని తెలిపారు.



సాయం అందజేస్తున్న మంత్రి సుభాష్

మహిళకు రూ.15 వేల సాయం

ప్రజాశక్తి - రామచంద్రపురం

ఆర్థిక ఇబ్బందులతో సతమవుతున్న ఒక మహిళకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ రూ.15 వేల సాయం ఆదివారం అందజేశారు. పి గన్నవరం మండలం ముక్కేశ్వరం గ్రామానికిచెందిన జనిపల్లి సంధ్య భర్తను కోల్పోయి పిల్లలతో ఆర్థిక ఇబ్బందుల్లో సతమతమవుతోంది. ఈ విషయం తెలుసుకున్న మంత్రి సుభాష్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా రూ.15 వేలు చెక్కును తక్షణ సహాయంగా బాధిత కుటుంబానికి అందజేశారు. ఇద్దరు పిల్లలకు చదివించి వారి భవిష్యత్తును తీర్చిదిద్దాలని సూచించారు. పిల్లల చదువుకు తోడ్పాటు అందిస్తానని హామీ ఇచ్చారు. మంత్రి సహాయానికి మహిళ కృతజ్ఞతలు తెలిపింది.



రామచంద్రపురం పట్టణంలో వెలవెలబోతున్న దుకాణాలు

అంతంత మాత్రంగానే బాణసంచా విక్రయాలు

ప్రజాశక్తి- రామచంద్రపురం

దీపావళి బాణసంచా ధరలు అమాంతం పెరగడంతో వినియోగదారులు కొనుగోలు చేసేందుకు వెనకడుగు వేస్తున్నారు. దీంతో ఆదివారం అమ్మకాలు అంతంత మాత్రమే కొనసాగాయి. దీపావళి అనగానే దీపాలతో పాటు బాణసంచా టపాసులు కాల్చుకునేందుకు పిల్లలు పెద్దలు ఎంతో ఉత్సాహం చూపుతారు. దీంతో ప్రతి ఇంటా బాణాసంచా కాల్చేందుకు అధిక మొత్తంలోనే ఖర్చు పెడతారు. ప్రతి సంవత్సరం దీపావళి బాణసంచా మందులు ధరలు పెరుగుతూ వస్తున్నాయి. ఈ ఏడాది మరింత ధరలు మన్నడంతో కొనుగోలుదారులు అంతంత మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. దీనికి తోడు ఆదివారం, సోమవారం మాత్రమే అమ్మకాలు కొనసాగించాలని ప్రభుత్వం నిబంధనం పెట్టడంతో వినియోగదారులు ఈ రెండు రోజులపాటు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఉంది. అయితే ఆదివారం ఉదయం వర్షం రావడంతో బాణసంచా దుకాణాలకు వెళ్లేందుకు జనం సుముఖత చూపలేదు. సాయంత్రం అమ్మకాలు అంతంత మాత్రమే ఉన్నాయని వ్యాపారులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇక మిగిలిన ఒక్కరోజులో ఎంతవరకు అమ్మకాలు కొనసాగుతాయి అనేది వేచి చూడాల్సి ఉంది.

కపిలేశ్వరపురం: దీపావళి సందర్భంగా ఆదివారం కపిలేశ్వరపురం మండలంలోని అంగర, టేకి, కపిలేశ్వరపురం, కోరుమిల్లి గ్రామాల్లో ఏర్పాటుచేసిన బాణసంచా దుకాణాలు వెలవెలబోయాయి. బాణాసంచా దుకాణదారులకు అధికారులు రెండు రోజులు మాత్రమే తాత్కాలిక లైసెన్సులు జారీ చేశారు. దీంతో రూ. లక్షల్లో పెట్టిన పెట్టుబడి వస్తుందా అనే ఆందోళనలో దుకాణదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు వాతావరణం బెంబేలెత్తిస్తోంది. మరోవైపు గత ఏడాది కంటే బాణాసంచా 3 శాతం పెరగడంతో వినియోగదారులకు ఇబ్బందిగా మారిందని దుకాణదారులు తెలిపారు. కనీసం పెట్టిన పెట్టుబడి వస్తే చాలు అన్న ఆలోచనలో ఉన్నట్లు దుకాణదారులు తెలిపారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం

ప్రజాశక్తితో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ గణపతి



ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అన్ని రకాలుగా చర్యలు తీసుకుంటుందని, వారికి వెన్నుదన్నుగా జిల్లా పరిశ్రమల కేంద్రం నిలుస్తోందని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ సిహెచ్.గణపతి అన్నారు. జిల్లాలో సుమారు 13,681 వరకు సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, నూనె శుద్ధి, టైల్స్ తయారీ, రైస్ మిల్లింగ్, ఆహార శుద్ధి, ప్యాకేజింగ్, వ్యవసాయ ఆధారిత, మత్స్య ఆధారిత ఉత్పత్తులు, ఆటోమొబైల్, ఇంజనీరింగ్ ఫ్యాబ్రికేషన్ మొదలగు రంగాలలో స్థాపించి ఉన్నాయన్నారు. జిల్లాలో పారిశ్రామిక ప్రగతిపై ఆయన 'ప్రజాశక్తి' ముఖాముఖిలో పలు అంశాలను వివరించారు.

2025-2026 సంవత్సరంలో పరిశ్రమల లక్ష్యం ఎంత..?

జిల్లాలో ఇప్పటివరకు అన్ని పరిశ్రమలు స్థాపింపబడి సుమారు 50 వేల మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. 61 పెద్ద, భారీ తరహా పరిశ్రమల ద్వారా మరో 38,500 మందికి ఉపాధి కల్పిస్తూ స్థూల దేశీయోత్పత్తిలో తమ వంతు భాగాన్ని అందిస్తున్నాయి. సిఎం నిర్దేశించిన దాని ప్రకారం ప్రతి కుటుంబంలో ఒక పారిశ్రామికవేత్త అనే లక్ష్యంతో జిల్లా పరిశ్రమల కేంద్రం వివిధ కేంద్ర, రాష్ట్ర పథకాలు అమలు పరిచేందుకు కృషి చేస్తుంది.

పిఎం ఉపాధి కల్పన పథకంతో ఎంత మేలు..?

ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం ద్వారా గ్రామాలు, పట్టణాల్లోని నిరుద్యోగ యువత వివిధ పారిశ్రామిక వ్యాపార కార్యకలాపాలు నిర్వహించుకొనేందుకు వాళ్ళు తీసుకున్న రుణాలపై 35 శాతం, 25 శాతం సబ్సిడీ కల్పిస్తున్నారు. అలాగే గత సంవత్సరం, ప్రస్తుత సంవత్సరం కలిపి మొత్తం 221 మంది ఈ పథకం ద్వారా లబ్ధి పొందారు.

పిఎం విశ్వకర్మ పథకం లక్ష్యం..?

పిఎం విశ్వకర్మ పథకం ద్వారా వివిధ కుల వృత్తుల వారికి లబ్ధి చేకూర్చే విధంగా కృషి చేస్తున్నాము. వాటికి సంబంధించి 722 దరఖాస్తులను ఇప్పటికే స్వీకరించాము.

ర్యాంప్ పథకం అంటే ఏమిటి.?

ఎంఎస్ఎంఇల పని తీరును మెరుగు పరచడం, అభివృద్ధిని వేగవంతం చేయడం కోసం ప్రపంచ బ్యాంక్ ఆర్థిక సహకారంతో కేంద్ర ప్రభుత్వం ర్యాంప్ అనే పథకాన్ని ప్రకటించింది. మన రాష్ట్రంలో ఎంఎస్ఎంఇ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పర్యవేక్షణలో ఉద్యమ్ అవగాహన సదస్సులు, జెడ్ రిజిస్ట్రేషన్ సదస్సులు, ఎంఎస్ఎంఇ కాంపిటీటివ్ లేయిన్ స్కీమ్ అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. ఎంఎస్ఎంఇల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న వివిధ ప్రోత్సాహకాలు, వాటికి ఉండే ప్రయోజనాలు వివరించడమే ఈ రాంప్ పథకం లక్ష్యం.

ఉద్యమ్ అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారా.?

జిల్లాలో ఇప్పటి వరకు 27 ఉద్యమ్ అవగాహన సదస్సులు వివిధ మండలాల్లో నిర్వహించాం. ఇంకా పలు ప్రాంతాలలో ఏర్పాటు చేస్తాం. వీటి వల్ల వివిధ రకాల ప్రభుత్వ ప్రోత్సాహకాలు పొందేందుకు, బ్యాంకు రుణ సదుపాయాలు, ఎంఎస్ఎంఇల డిలేడ్ పేమెంట్లను సమాధాన పోర్టల్‌తో అనుసంధానించడం ద్వారా కలిగే ప్రయోజనాలను ఈ సందర్భంగా వివరిస్తున్నాము.

నూతన పరిశ్రమల స్థాపనకు చర్యలు..?

జిల్లాలో నూతన పరిశ్రమల స్థాపనకు మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, నిబంధనలను క్రమబద్ధీకరించడం, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడం, వ్యాపారాల్లో స్నేహపూర్వక వాతావరణన్ని సృష్టించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక అభివృద్ధి విధానం-2024-29, ఎంఎస్ఎంఇ, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ పాలసీ-2024-29, ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ-2024-29లను అమలు చేస్తుంది. ఈ నేపథ్యంలో పారిశ్రామికంగా జిల్లాను అభివృద్ధి పథంలో నడిపేందుకు అవసరమైన చర్యలు చేపట్టడం జరుగుతుంది.

ఏకగవాక్ష విధానంలో దరఖాస్తులను స్వీకరిస్తున్నారా.?

జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ఏక గవక్ష విధానం కింద ఔత్సాహిక పారిశ్రామికవేత్తల నుంచి అందిన దరఖాస్తులను త్వరితగతిన అనుమతులు కల్పించేలా కలెక్టర్ సూచనలు మేరకు కలిసి పని చేస్తున్నాం. పారిశ్రామిక రంగాన్ని బలోపేతం చేయడంతో పాటు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేలా కృషి చేయడం జరుగుతుంది. జిల్లాలో పారిశ్రామికవేత్తలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుంది. కాకినాడ జిల్లా భౌగోళిక పరిస్థితులు, అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ భవిష్యత్తులో ఎటువంటి పరిశ్రమలను స్థాపిస్తే ఉపయుక్తంగా ఉంటుందో వాటిని ప్రోత్సహించడం జరుగుతుంది.



సంత రహదారిలో ట్రాఫిక్ అవస్థలు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక కుమ్మర వీధిలోని సంత మార్కెట్ రహదారిలో సంత జరిగే ప్రతి ఆదివారం తీవ్ర ట్రాఫిక్ సమస్యలతో ప్రజలు, కొనుగోలుదారులు, వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. సంత మార్కెట్‌ను ఆనుకునే కుమ్మరి వీధి సెంటర్ నుంచి సామర్లకోట-ప్రత్తిపాడు రహదారికి వెళ్లే రోడ్డు ఉండటంతో ప్రతిరోజు వందలాది వాహనాలు ఈ రహదారి మీదిగానే వెళుతుంటాయి. దీనికి తోడు ఈ రహదారిలో అనేక పరిశ్రమలు, మండల పరిధిలోని ఏటిపట్టు గ్రామాలు ఉండటంతో ప్రతిరోజు వాహనాలపై వెళ్లే వారి సంఖ్య ఎక్కువగా ఉంటుంది. ఈ సంత మార్కెట్ ఎదురుగానే శ్మశానం ఉండటంతో ఆదివారం రోజున శ్మశానానికి వెళ్ళవలసి వస్తే ఈ ట్రాఫిక్ వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం రోజున ఈ రహదారిని ఆనుకుని సంత వ్యాపారాలు జరగడంతో ట్రాఫిక్కుకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. అధికారులు దీనిని గమనించి ప్రతి ఆదివారం ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని పలువురు విజ్ఞప్తి చేశారు.



ట్రాఫిక్‌లో చిక్కుకున్న వాహనదారులు

ప్రభుత్వ ఉద్యోగులకు నిరాశ : కురసాల

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వ ఉద్యోగులతోపాటు, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు తీవ్ర నిరాశే ఎదురైందని మాజీ మంత్రి కురసాల కన్నబాబు అన్నారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలు ముందు ఇచ్చిన హామీలలో ఏ ఒక్కటి అమలు చేయలేక పోయిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 16 నెలలలో విద్య, వైద్య రంగాలతో పాటు అన్ని రంగాలను గాలికి వదిలేసిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఒక డి ఎ ప్రకటించి పండగ చేసుకోవాలని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. పేద ప్రజలకు ఎంతో ఉపయోగపడే కార్పొరేట్ ఆసుపత్రులు వారం రోజులుగా ఆరోగ్యశ్రీ వైద్య సేవలను నిలిపివేసినప్పటికీ ప్రభుత్వం ఇప్పటికీ స్పందించకపోవడం దారుణమన్నారు. రైతులకు ఇస్తానన్న బీమా డబ్బును ఇవ్వకుండా మోసం చేసిందన్నారు. అలాగే ప్రయివేట్ విద్యాసంస్థల్లో చదువుకుంటున్న విద్యార్థులకు ఫీజ్ రియంబర్స్మెంట్ ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గ్రామాలలో పిహెచ్‌సి, సిహెచ్‌సి డాక్టర్లు 15 రోజులుగా విధులకు వెళ్లకుండా సమ్మె చేస్తున్నారని, దీంతో గ్రామ స్థాయిలో ప్రజలకు ఆరోగ్య అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రయివేట్ పరం చేసి ప్రభుత్వ వైద్యాన్ని ప్రజలకు అందకుండా చేయడం ప్రజల హక్కులను కాలరాయిడమేనన్నారు. ఫన్షనర్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని చెప్పి మాజీ ఉద్యోగులను మోసం చేశారని అన్నారు. గతంలో వేసిన పిఆర్‌సి కమిషన్ ఛైర్మన్‌ని వెలగొట్టి పిఆర్‌సి ప్రస్తావన లేకుండా ఉద్యోగులను కూటమి ప్రభుత్వం మోసం చేస్తుందని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులందరూ ప్రభుత్వంపై పూర్తి వ్యతిరేకంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న కురసాల



ఏలేశ్వరంలో షాపుల వద్ద వ్యాపారులు

వర్షంతో కుదేలైన బాణసంచా వ్యాపారులు

ప్రజాశక్తి - సామర్లకోట, ఏలేశ్వరం

పలు చోట్ల కురిసిన కుండపోత వర్షంతో బాణసంచా వ్యాపారులు దిక్కుతోచని స్థితిలోకి నెట్టబడ్డారు. సామర్లకోట పట్టణంలోని బడేలమ్మ చెరువు ఎదురుగా రోడ్డుకి ఇరువైపులా 14 బాణసంచా దుకాణాలు ఏర్పాట్లు చేశారు. దీపావళికి ఒకరోజు ముందు కురిసిన భారీ వర్షంతో బాణసంచా వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అలాగే ఏలేశ్వరంలో కురిసిన వర్షం బాణాసంచా వ్యాపారులకు తీవ్ర నిరాశను మిగిల్చింది. శనివారం సాయంత్రం టెంట్లు వేసి మందు గుండు సామాగ్రిని తరలించుకున్న వ్యాపారులకు ఆదివారం వచ్చి చూసేసరికి ఏర్పాటు చేసిన టెంట్లు వర్షం ప్రభావంతో కూలిపోయాయి. వర్షం పడడంతో లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టామని, వర్షం ప్రభావంతో తీవ్రంగా నష్టపోయామని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు.

దీపావళిని సురక్షితంగా జరుపుకోవాలి

ప్రజాశక్తి - సామర్లకోట

దీపావళి పండుగను ప్రజలు సురక్షితంగా జరుపుకోవాలని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప కోరారు. ఆదివారం ఆయన సామర్లకోటలోని దీపావళి బాణసంచా విక్రయ దుకాణాలను పరిశీలించారు. చిరు వ్యాపారుల కోసం త్వరలోనే ఒక మార్కెట్ నిర్మాణానికి కృషి చేస్తానని అన్నారు. ఈ పర్యటనలో కూటమి నాయకులు బడుగు శ్రీకాంత్, అడబాల కుమారస్వామి, మలిరెడ్డి దుర్గాప్రసాద్, భీమేశ్వర ట్రస్ట్ బోర్డు మెంబర్ తాతపూడి అరుణ్‌వంశీ, మండల టిడిపి అధ్యక్షులు ముసిరెడ్డి శ్రీరాములు, మండల తహాశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని కాంట్రావులపల్లి జడ్‌పి హైస్కూల్లో చదువుకున్న పూర్వపు విద్యార్థులు ఆదివారం 65 ఏళ్ల వయసులో 15 ఏళ్ల యువకుల్లా సందడి చేశారు. 1970 - 75 సంవత్సరంలో చదువుకున్న విద్యార్థులు కాట్రావులపల్లి కళ్యాణ మండపంలో ఆదివారం ఆత్మీయ కలయికగా కలుసుకున్నారు. సుమారు 50 ఏళ్ల తరువాత కలుసుకుని గత తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. వృద్ధాప్య దశకు చేరుకుని ఎక్కడెక్కడో స్థిర పడిన వారు సైతం వచ్చి ఈ ఆత్మీయ సమ్మేళనంలో ఉత్సాహంగా గడిపారు. అనంతరం పలువురిని సాలువాలు, పూలమాలతో సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కాట్రావులపల్లి నీటి సంఘం అధ్యక్షులు కంటే రామారావు, సర్పంచ్ పిట్ట సుగుణ రావు, షేక్ జిన్నా, కొంగర వెంకటనారాయణ, ఏలేటి పద్మ ప్రసాద్, జల్లంగి వీరభద్రరావు, కష్ట ప్రసాద్, వెంకట్రావు, దేవ గుప్తావు, వెంకట్రావు, హై స్కూల్ హెచ్‌ఎం తాతపూడి వెంకటరమణ తో పాటు పూర్వ విద్యార్థులు 75 మంది పాల్గొన్నారు.



50 ఏళ్ల తరువాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు



అభివాదం చేస్తున్న యాదవ సంఘీయులు

చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించాలి

ప్రజాశక్తి - యానాం

చట్టసభల్లో యాదవులకు తగిన ప్రాతినిధ్యం కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని యాదవ మహాసభ కోరింది. ఆదివారం స్థానిక అగ్నికుల క్షత్రియ కల్యాణ మండపంలో ఎపి అఖిల భారతీ యాదవ మహాసభ సమావేశం జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు, పుదుచ్చేరి అధ్యక్షుడు మట్టా సురేష్ యాదవ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జాతీయ ప్రధాన కార్యదర్శి నుర్తు నరేంద్రయాదవ్ మాట్లాడుతూ 70 ఏళ్లుగా 50 శాతంగా ఉన్న బిసి జనాభాకు సమానమైన రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నా పాలకులు స్పందించడం లేదన్నారు. ఇప్పటికైనా శాస్త్రీయంగా నిర్ధారణ చేసి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణాలో సైతం స్థానిక సంస్థల్లో 46 శాతం రిజర్వేషన్లు అమలుకు నిర్ణయం జరిగిందని తెలిపారు. రాష్ట్రంలో సుమారు 80 లక్షలుగా ఉన్న యాదవులకు వచ్చే ఎన్నికల్లో 25 అసెంబ్లీ, 5 ఎంపి సీట్లు కేటాయించాలని తీర్మానించారు. యాదవ కార్పొరేషన్‌కు రూ.2 వేల కోట్లను బడ్జెట్‌లో కేటాయించాలని, అమరావతిలో యాదవుల వసతికోసం యాదవభవన్ నిర్మాణం, పశువులకాపరుల పిల్లల విద్యకై గురుకుల పాఠశాల, టిటిడి దేవస్థానంలో యాదవులకు మఠం నిర్మాణం, పాలక మండలిలో సభ్యుడిగా నియామకం చేయాలని తీర్మాణించారు. ఈ సమావేశంలో ఎంఎల్‌సి రామారావు, నాయకులు రామచంద్రయాదవ్, కుండల సాయికుమార్ యాదవ్, కోన గురవయ్య, పెనుగొండ దుర్గబాబు, మట్టా పుల్లారావు, పుట్టి ఏడుకొండలు, ఏసుబాబు, మొండి సత్యనారాయణ, వీరబాబు, గంగుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

గిరిబాబును కలిసిన శివకుమార్

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

వైసిపి నియోజకవర్గ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబును ఆర్‌టిఐ వింగ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన లింగంపల్లి శివకుమార్ ఆదివారం కిర్లంపూడిలోని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. గిరిబాబుకు పుష్పగుచ్ఛం ఇచ్చి కృతజ్ఞతలు తెలిపారు.



గిరిబాబుకు కృతజ్ఞతలు చెబుతున్న శివకుమార్

మరిడమ్మ ఆలయంలో అన్నదానం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మరిడమ్మ ఆలయంలో ఆదివారం ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దాతల సహాయ సహకారాలతో అన్నదానం నిర్వహిస్తున్నామన్నారు. ఈ అన్నదాన కార్యక్రమంలో వేద పండితులు ఐవి.ప్రసాద్‌శర్మ, ఎన్‌వి.అవధాని, శంకర్, ఆసాదులు రాయి నాని, రామ చంద్రప్రసాద్, సిబ్బంది ఎస్.రమణ, జి.క్రాంతి, శివ, వరహాలు సేవలందించారు.



అన్నదానాన్ని పర్యవేక్షిస్తున్న ఎసి విజయలక్ష్మి



జొన్నాడ ఫ్లైయ్‌ఓవర్ దుస్థితి

నిలిచిన జొన్నాడ ఫ్లయ్‌ఓవర్ నిర్మాణం

- ప్రస్తుత కాంట్రాక్ట్ సంస్థ రద్దు
- మళ్లీ టెండర్లకు పిలుపు
- వాహనదారులకు తప్పని ఇక్కట్లు
- త్వరితగతిన పూర్తిచేయాలని విజ్ఞప్తి

ప్రజాశక్తి - ఆలమూరు

ఎన్నో ఏళ్ల నుంచి నత్తనడకన సాగుతున్న ఆలమూరు మండలం జొన్నాడ ఫ్లయ్‌ఓవర్ నిర్మాణ కాంట్రాక్ట్ రద్దు అయింది. ఫ్లయ్‌ఓవర్ నిర్మాణ పనులు జాప్యం వల్ల వాహనదారులు పడరానిపాట్లు పడుతున్నారు. దీనిపై కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు, అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాదుర్‌లు ఎన్నిసార్లు జిల్లా స్థాయిలో సమీక్ష జరిగినప్పటికీ ఫలితం లేకపోయింది. చివరికి ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్వహించిన జిల్లా కలెక్టర్ల సమావేశంలో జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. పని చేయని ఆ కాంట్రాక్ట్ సంస్థను రద్దు చేయాలని సిఎం ఆదేశించారు. దీనిపై ఆ కాంట్రాక్ట్ సంస్థ కు నోటీసు ఇవ్వగా ఈ నిర్మాణ పనుల నుంచి ఆ సంస్థ తప్పుకోవడానికి సిద్ధమని లిఖిత పూర్వకంగా రాసిచ్చింది. దీంతో ఎలాంటి లీగల్ సమస్య లేకుండా వచ్చే నెలలో మళ్లీ టెండర్లు పిలిచి వేరే కాంట్రాక్ట్ సంస్థకు అప్పగించడానికి నేషనల్ హైవే అథారిటీ అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఈ ఫ్లయ్‌ఓవర్ ఫిల్లర్స్ పూర్తయ్యాయి. గడ్డర్స్ కూడా నిర్మించి సిద్ధంగా ఉంచారు. వాటిని పిల్లర్స్‌పై పెట్టి స్లాబ్ వేస్తే సరిపోతుంది. అదేవిధంగా అప్రోచ్ రోడ్ వాల్ కి అవసరమైన కాంక్రీట్ దిమ్మలు కూడా జొన్నాడ శివాలయం ఆవరణలో తయారుచేసి సిద్ధంగా ఉన్నాయి. పాత కాంట్రాక్ట్ సంస్థకు ఇప్పటివరకు చేసిన పనులకు బిల్లులు చెల్లించి కొత్త కాంట్రాక్ట్ కొనసాగించడానికి అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఏళ్ళ తరబడి ఈ ఫ్లయ్‌ఓవర్ నిర్మాణం పూర్తి చేయకపోవడం వల్ల వాహనదారులు ఇటుగా వెళ్లడానికి ఇబ్బందులు పడాల్సి వస్తోంది. 2022 సెప్టెంబరు 22న జాతీయ రహదారులు, రవాణా శాఖ కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ రాజమహేంద్రవరం వచ్చి ఈ ప్యాకేజీకి శంకుస్థాపన చేశారు. ఇదే ప్యాకేజీ లో ఉన్న మోరంపూడి ఫ్లయ్‌ఓవర్ ప్రారంభించి ఏడాది అవుతున్న నిర్మాణం మాత్రం ముందుకు సాగలేదు. కొత్త కాంట్రాక్ట్ సంస్థ ద్వారా పనులు వేగవంతంగా జరగడానికి అధికార యంత్రాంగం చర్యలు చేపడతారని ప్రయాణికులు కోరుతున్నారు.

న్యాయం చేయాలని ఎంఎల్ఎకు వినతి

ప్రజాశక్తి - కరప

మండలంలోని కూరాడ గ్రామానికి చెందిన డ్వాక్రా రుణాల వ్యవహారంలో జరిగిన అవకతవకలపై విచారణ చేసి న్యాయం చేయాలని పలువురు మహిళలు ఎంఎల్ఎ పంతం నానాజీని కోరారు. ఎంఎల్ఎ కార్యాలయంలో ఆదివారం ఎంఎల్ఎను డ్వాక్రా మహిళలు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. రుణాలు చెల్లింపులు చేశామన్నా బ్యాంకు నమోదు కాలేదని, బిసి పాయింట్ వద్ద చెల్లించిన సొమ్ములకు చేతితో రాసిన రసీదులు మాత్రమే ఇచ్చారన్నారు. ఇందుకు కారుకులైన వారి వద్ద నుంచి సొమ్ములు రికవరీ చేసి లబ్ధిదారులకు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్య పరిష్కరిస్తానని ఎంఎల్ఎ వారికి హామీ ఇచ్చారు.



మహిళలతో మాట్లాడతున్న ఎంఎల్ఎ నానాజీ